5



## గిరిజన ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం


# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ బుధవారం | 16 జూలై 2025 | ■ 12 పేజీలు


7లో



## భూమి నాశనమవుతుంది..

# నిజం.. అది విషం..!




- బయోమందుల పేరుతో భారీగా దోపిడీ
- రైతులు ప్రాణాలను బలిగొంటున్న వ్యాపారులు
- కలుపు నివారణే ధ్యేయంగా పంటల్లో వినియోగం
- కూలీల ఖర్చులు మిగులుతాయని రైతుల ఆశ
- ధనార్జనే ధ్యేయంగా పలువురు వ్యాపారుల అక్రమ దందా
- పట్టించుకోని వ్యవసాయశాఖ

■ ప్రభాత సమాచారం, ఆదిలాబాద్ ప్రతినిధి

ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన కలుపు నిర్మూలన గ్లైఫోసెట్ మందు వల్ల నేలతోపాటు మానవాళికి ప్రమాదం పొంచి ఉంది.. మన వద్ద ఈ విషతుల్యమైన గ్లైఫోసెట్ కలుపు నివారణ మందును విచ్చలవిడిగా వాడుతున్నారు. ఈ మందు పత్తి మొక్కలపై పండకుండా పిచికారీ చేసుకోవాల్సి ఉంటుంది.. అదే బీటీ-3 విత్తనాలు సాగు చేసే పంటలో.. ఎలా పిచికారీ చేసినా ఏమీ కాదు.. కలుపు మొత్తం పోతుంది.. ఎకరం పత్తిలో రెండు సార్లు కలుపు తీయాలంటే 20 నుంచి 30మంది కూలీల అవసరం ఉంటుంది.. అదే గ్లైఫోసెట్ మందుకు రూ.500, మందు పిచికారీ చేసేందుకు కూలీకి రూ.300 ఇస్తే సరిపోతుంది. మందు వేయడం వల్ల కలుపు సులువు అవుతుందని, ఖర్చు కూడా మిగులుతుందని రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో కొందరు వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా కలుపు నివారణ మందును గ్రామాల్లో ప్రత్యేకంగా ఏజెంట్లను పెట్టుకొని రైతులకు విక్రయిస్తూ అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని కంపెనీలు పేరు మార్చి మార్కెట్‌లోకి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్నీ తెలిసినా వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.



11

### మావోయిస్టులు

## జన స్రవంతిలోకి రావాలి

- రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝ
- లొంగిపోయిన వారికి పునరావాసం
- రామగుండం సీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దంపతులు ఆత్రం లచ్చన్న
- అజ్ఞాతం వీడిన 35 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం
- ఆపరేషన్ కగార్‌తో మారినత పంథా

మావోయిస్టులు అజ్ఞాతాన్ని వీడి జన స్రవంతిలోకి రావాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝ అన్నారు. మంగళవారం సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన రాష్ట్ర కమిటీ సభ్యులు ఆత్రం లచ్చన్న ఆలియాస్ గోపన్న, డీసీఎం చౌదరి అంకుబాయ్ లొంగిపోయిట్లు సీపీ తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల మావోయిస్టు గ్రామాల్లోకి రావాలని కోరారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం పునరావసం కల్పిస్తుందన్నారు. మావోయిస్టుల పట్ల చూపిస్తున్న ఆధారం తెలుసుకొని కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవనం గడపాలన్నారు.

## డి-1 పట్టాలపై సర్వే చేపట్టాలి

**నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**

అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని డివన్ పట్టాల జారీపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రెవెన్యూ, సర్వే శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డి-1 పట్టాలపై క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టే అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.





## రైతులకు అండగా ప్రభుత్వం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- కడెం ఎడమ కాలువకు నీటి విడుదల
- రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి
- బీఆర్ఎస్ ప్రభుత్వం కడెం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసి.. రైతులను ఆగం చేసింది..
- త్వరలో ప్రాజెక్టులో పూడికను తొలగిస్తాం

రైతులకు రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. కడెం ప్రాజెక్టు ఎడమ కాలువకు ప్రాజెక్టు ఈఈ విఠల్, ఏఎంసీ చైర్మన్ భూషణ్‌తో కలిసి మంగళవారం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడెం ప్రాజెక్టును గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, తాము అధికారంలోకి వచ్చాక రూ.9.46కోట్లతో వరద గేట్లు మరమ్మతులు చేయించామన్నారు. త్వరలో ప్రాజెక్టులో పూడికను తొలగిస్తాతమని ఆయన పేర్కొన్నారు.

వివరాలు12లో



### పెట్టిందే తిను.. అదే మెనూ..!

- పచ్చడి మెతుకులే విద్యార్థులకు గతి..
- అస్తవ్యస్తంగా కుభీర్ కస్తూర్బా ప్రాథమిక పాఠశాల
- సమయపాలన పాటించని ఉపాధ్యాయులు -3లో

### భూసార పరీక్షలు నిర్వహించాలి

- ఎరువుల వాడకం తగ్గించాలి..
- మట్టి సమునా పరీక్ష పత్రాలను పంపిణీ చేసిన ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా -12







## అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ
# సంక్షేమ పథకాలు అందిస్తాం

■ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు
■ లక్షెట్టిపేటలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జూలై 15 (ప్రభాత సమాచారం)**

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేంసాగర్ రావు, తహశిల్దార్ దిలీప్ కుమార్‌లతో కలిసి లబ్దిదారులకు రేషన్కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డులు లేకుండా అర్హత కలిగిన వారు మీ-సేవ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని, వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిశీలించి వివరాలను ప్రభుత్వానికి నివేదిక అందించడం జరుగుతుందని, దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఒక కుటుంబానికి సంబంధించిన రేషన్కార్డులో ఉన్న వారు ప్రత్యేక కార్డు కావాలనుకుంటే ముందుగా తమ వివరాలను పాత కార్డులో తొలగించుకొని నూతన రేషన్కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డిసెంబర్-2024లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో రేషన్కార్డు కొరకు తీసుకున్న వివరాలను డిజిటలైజ్ చేయడం జరిగిందని, జనవరి 26, 2025 నుండి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి నూతన రేషన్కార్డు కొరకు దరఖాస్తుల స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఇందులో దాదాపు 21 వేల దరఖాస్తులను ఆమోదించడం జరిగిందని, 9 వేల రేషన్కార్డులను సర్దుబాటు చేసి 3 వేల దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించడం జరిగిందని, సంబంధిత అభ్యర్థులకు సమాచారం అందించడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 2 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. లక్షెట్టిపేట మండలంలో 1 వేయి 538 నూతన రేషన్ కార్డులు అందించడంతో పాటు 2 వేల 84 మందిని రేషన్కార్డులలో చేర్పించి సర్దుబాటు చేయడం జరిగిందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు / మున్సిపల్ సిబ్బంది విచారణ కొరకు వస్తారని, వివరాల సేకరణ అనంతరం అర్హులకు రేషన్కార్డులు అందించడం జరుగుతుందని తెలిపారు. 3 నెలలు జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించి ప్రజాపంపిణీ వ్యవస్థలో చౌకధరల దుకాణాల ద్వారా రేషన్కార్డు దారులకు సన్నబియ్యం ఉచితంగా అందించడం జరిగిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని 10 లక్షల రూపాయల వరకు పెంచడం జరిగిందని, ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో లబ్దిదారులకు ఇండ్లు అందించడం జరిగిందని, ఇంకా మూడు విడతలు ఉన్నాయని, పి.వి.టి.జి., ట్రాన్స్ జెండర్లు, ఎస్.టి. అందరికీ ప్రత్యేకంగా ఇవ్వడం జరుగుతుందని, లబ్దిదారులు తమకు కేటాయించిన ఇండ్లను నిబంధనలకు లోబడి త్వరగా నిర్మించుకోవాలని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరికి సంక్షేమ



పథకాలు అమలు చేయడం జరుగుతుందని, సొంత ఇంటి స్థలం ఉండి అర్హత గల వారు ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత పంపిణీ, 500 రూపాయలకు రాయితీ గ్యాస్ సిలిండర్ కొరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం / మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి రావచ్చని, ఆధార్ అనుసంధానమైన బ్యాంక్ ఖాతాలో గ్యాస్ రాయితీ జమ చేయడం జరుగుతుందని, అర్హత కలిగి రాయితీ పొందని వారు దరఖాస్తు చేసుకున్నట్లయితే పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరోజ, అధికారులు పాల్గొన్నారు.

# ఓట్లు అడగడానికి వస్తే గ్రామాల్లో తిరగనివ్వం



■ సోమినిలో 12 గ్రామాల ప్రజల తీర్మానం

**బెజ్జూర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

బెజ్జూరు మండలం సోమినీ గ్రామాల్లోకి నాయకులు ఓట్లు అడగడానికి వస్తే గ్రామాల్లో పెరగనివ్వమని చుట్టుపక్కల ఉన్న 12 గ్రామాల ప్రజలు నిర్ణయించుకున్నారు. బెజ్జూర్ మండలంలోని సోమిని తదితర 12 గ్రామాల ముఖ్యనాయకులు సమావేశం మంగళవారం సోమీని గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వర్షాకాలం వస్తే ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని అత్యవసర సమయంలో కూడా మండల కేంద్రానికి వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పోతున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం వచ్చిందంటే కుష్నపల్లి గ్రామం నుంచి సోమిని వరకు ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా గుంతలమయమై వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అయితే ఈ రోడ్డు విషయమై అనేక సార్లు స్థానిక ఎమ్మెల్యే, అధికారులకు విన్నవించినా ఎటువంటి ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో సమస్యను మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దృష్టికి తీసుకువెళ్లగా, ఈ సమస్య పై స్పందించి వెంటనే వారం రోజుల్లో రోడ్డు మరమ్మతులు చేయిస్తానని చరవాణి ద్వారా గ్రామస్థులకు తెలిపారు. తాజాగా కల్వర్టుకు మరమ్మత్తులు చేపట్టారు. ఈ సమావేశంలో సోమిని, సుస్మీర్, మొగవెల్లి సర్పంచులు మాజీ సర్పంచులు ,ఎంపీటీసీ లు ఆత్రం సాయి, లంగారి శ్రీనివాస్ నాయకులు ఎలాది చెంద్రశేఖర్, ఆలం అనిల్, నైతం సత్తయ్య, దందేరా ఇస్తారి, దుర్గం శంకర్, నైతం రాజు, కొడప మల్లాజీ, ఎం. డి. అమీరొద్దీన్, ఎర్మ రామన్న రైతులు,గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



## హద్దులను గుర్తించేందుకే సర్వే

**ఖానాపూర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ శివారులో భూ హద్దులను గుర్తించేందుకే రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టినట్లు ఆర్డీఓ రత్న కళ్యాణి తెలిపారు. కడెం మం టడలం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ శివారులో జరుగుతున్న రెవెన్యూ భూ సర్వే ప్రదేశాన్ని నిర్మల్ ఆర్డీవో రత్నకళ్యాణి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, 2015 సంవత్సరంలో అటవీ శాఖ భూములను పునరావాస గ్రామాల ప్రజల ప్రయోజనాల కొరకు డీనోటిఫై చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామాల ప్రజలకు చట్ట ప్రకారం భూములు పంచేందుకు అర్హులను గుర్తించామని అన్నారు. ఈ భూముల తుది హద్దులను గుర్తించేందుకే అధికారులు సర్వే చేపట్టారని తెలిపారు. ఈ సర్వేపై ప్రజలెవరూ ఆందోళన చెందవద్దన్నారు. భూ సర్వేకు సంబంధించి సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించాలని తెలిపారు. భూ హద్దుల గుర్తింపు సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

## సోమినీ ఆశ్రమ పాఠశాల తనిఖీ

**బెజ్జూర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

బెజ్జూరు మండలం సోమిని ఆశ్రమ పాఠశాలను ఎంఈఓ సునీత మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. విద్యాబోధన సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఎస్ఈ ఆర్పి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు బిక్షమయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



### మంచిర్యాల అదనపు కలెక్టర్‌గా
## శ్రీనివాస్ రావుకు అదనపు బాధ్యతలు
### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జూలై 15 (ప్రభాత సమాచారం)**



జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావుకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా శ్రీనివాస్ రావు కొనసాగుతారని తెలిపారు.

### డి-1 పట్టాలపై
## క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలి
### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని డివన్ పట్టాల జారీపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రెవెన్యూ, సర్వే శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డి వన్ పట్టాలపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టే అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా



వ్యవహరించి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. భూ హక్కులపై స్పష్టత కలిగేలా దరఖాస్తుల పరిశీలనలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులను భూభారతి పోర్టల్‌లో వెంటనే అప్డేట్ చేయాలని, వీలైనంత ఎక్కువ అప్లికేషన్లను త్వరితగతిన డిస్పోజ్ చేయాలని తహసీల్దార్లకు సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసీల్దారు, సర్వే శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డుపై అక్రమ నిర్మాణాలను ఆపాలి

**ముథోల్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

రోడ్డుపై నిర్మించే అక్రమ నిర్మాణాలను ఆపాలంటూ బైంసా మండలం ఖత్గావ్ పలువురు గ్రామస్తులు మంగళవారం ఆర్డీవో,మున్సిపల్ కార్యాలయలలో వినతిపత్రం అందించారు. బైంసా నుండి వయ ఖాత్గాం కామోల్ గ్రామానికి వెళ్ళే పంచాయతీరాజ్ రోడ్డు గతంలో 40 పిట్ల మేర ఉండేదనీ, ప్రస్తుతం అది కాస్త 12 ఫీట్లు నుండి 16 పిట్ల వరకే ఉందనీ వాపోయారు.అక్రమంగా రోడ్డు పై గోడని నిర్మిస్తున్నారని,అట్టి నిర్మాణాలను ఆపాలని భైంసా కోరారు.పోలీస్ టౌన్ కార్యాలయాలలో సైతం వినతి పత్రం అందించమని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామానికి రాకపోకలకు, పొలాలకు వెళ్లడానికి హార్వెస్టర్, టాక్టర్స్ తీసుకువెళ్లాలంటే రోడ్డుపై అక్రమ కట్టడాల నిర్మాణం ఇబ్బందులు కలిగిస్తున్నాయని వారు పేర్కొన్నారు.





# పెట్టిందే తిను.. అదే మెనూ..!

- పచ్చడి మెతుకులే విద్యార్థులకు గతి..
- అస్తవ్యస్తంగా కుభీర్ కస్తూర్బా ప్రాథమిక పాఠశాల
- సమయపాలన పాటించని ఉపాధ్యాయులు..
- విద్యార్థులకు మెనూ ప్రకారం అందని భోజనం

**కుభీర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

కుభీర్ మండలంలో విద్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. వసతి గృహాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. ఇందుకు నిదర్శనం మండల కేంద్రమైన కుభీర్ కస్తూర్బా గాంధీ, గిరిజన ఆశ్రమ పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలే ఆదర్శంగా నిలుస్తున్నాయి. మంగళవారం గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఉదయం ఇడ్లీ, సాంబార్ అందించాలి కానీ దానికి బదులు కిచిడి పెట్టి చేతులు దులుపుకున్నారు. విద్యార్థులు కిచిడి రుచికరంగా లేకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకున్న ఊరగాయతో కడుపు నింపుకున్నారు. మరికొందరు అది తినలేక అన్నం పారేసి కడుపు మాడ్చుకున్నారు. ఉపాధ్యా యులు పాఠశాలకు సమయానికి హాజరు కాకపోవడంతో ఇద్దరు ఉపాధ్యాయులతో ప్రార్థన నిర్వహించారు. ప్రార్థన అనంతరం 20 నిమిషాలకు మిగతా ఉపాధ్యాయులు వచ్చా రు. అలాగే కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో కూడా అదే పరిస్థితి నెలకొంది. ప్రార్థన సమయంలో నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ప్రార్థన అనంతరం మిగతా ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా ఒక్కరు కూడా సమయానికి రాలేదు. దీంతో విద్యార్థులు పాఠశాల పరిసరాలలో ఆటలు ఆడుకుంటూ కాలక్షేపం చేశారు. మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతి విద్య సంవత్సరం ప్రారంభంలో విద్యా వ్యవస్థను గాడిలో పెడుతున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్య వ్యవస్థ గాడి తప్పుతోందన్న ఆరోపణలు ఉన్నాయి ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి విద్యావ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యావేత్తలు, పిల్లల తల్లిదండ్రులు పలువురు కోరుతున్నారు.



ఈ విషయమై గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రాధానోధ్యాయురాలిని వివరాణ కోరగా ఉదయం వంట చేసే సమయంలో గ్యాస్ సిలెండర్ రిపేర్ కావడంతో విద్యార్థులకు ఇండ్లి సాంబార్‌కు బదులు కిచిడి వండించాం. విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి విజయ్ కుమార్ పాఠశాలను తనిఖీ చేశారు. ఇలాంటి తప్పులు మళ్ళీ జరగకుండా చూడాలని సిబ్బంది ఆదేశించారు. పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. ఉదయం 9.5కి ప్రార్థన ప్రారంభించాలి. సంబంధిత హెడ్‌మాస్టర్లతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల ప్రాధానోపాధ్యాయులు తిరుమల, వాణి శ్రీ ఉపాధ్యాయులున్నారు.



## అబుదాబిలో గుండెపోటుతో పొన్కల్ వాసి మృతి

### పొన్కల్ గ్రామంలో విషాదఛాయలు

**జన్నారం, జూలై 15 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన కోటగిరి శ్రీనివాస్ (46) అబుదాబి దేశంలో గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. రేక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబం నాలుగు పైసలు సంపాదించాలన్న ఆశతో గత కొన్ని నెలల క్రితం గల్ఫ్ దేశం వెళ్లాడు. కంపెనీలో పనిచేస్తుండగా ఒకసారి కుప్పకూలడంతో గమనించిన తోటి మిత్రులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేదు. దీంతో ఇంటికి పెద్దదిక్కును కోల్పోవడంతో భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. అబుదాబిలో ఉన్న మిత్రులు, హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ సభ్యులు, శవాన్ని స్వగ్రామానికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అందరిని చిరునవ్వుతో పలకరించే శ్రీనివాస్ అనంత లోకాలకు వెళ్లడంతో మిత్రులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

## కువైట్‌లో చిక్కుకున్న జన్నారం మండలం రాంపూర్ వాసి

**జన్నారం, జూలై 15 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన గొర్రె శాంతయ్య అనే వ్యక్తి కువైట్‌లో చిక్కుకున్నట్లు తెలిపారు. ఎలాగైనా తనను ఇక్కడి నుంచి రక్షించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నాడు. ఈ మేరకు మంగళవారం ఓ వీడియో విడుదల చేశాడు. శాంతయ్య తన యజమానులు జీతాలు చెల్లించడం లేదని, కనీసం తిండి పెట్టడం లేదని కన్నీళ్లు పెట్టుకున్నాడు. గత మూడు రోజులుగా తనను తిప్పుతున్నారని, తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని మొరపెట్టుకున్నారు. ఇక్కడి నుంచి తనను కాపాడాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి



ఆదుకోవాలని వేడుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. భారత రాయబార కార్యాలయం, తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుని, శాంతయ్యను స్వదేశానికి తిరిగి తీసుకురావాలని ఆయన కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



**బజార్‌హత్నూర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

మహిళల ఆర్థిక తోడ్పాటు అందించిందికే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నారని ఎంపీ నగేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్లో ఓఎన్జీసి ద్వారా మండల మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేశారు. ఇందులో భాగంగా మండలంలోని 18 గ్రామాలకు చెందిన కుట్టు మిషన్ శిక్షణ పొందిన వారికి 270 కుట్టు మిషన్లను ఓఎన్జీసి సంస్థ సభ్యులు మృత్యుంజయతో కలసి ఎంపీ నగేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మహిళలకు ఆర్థిక స్వావలంబన పొందుటకు వారికి తోడ్పాటు అందించడానికి ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని కుట్టుమిషన్లను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు ఎంపీ గోడం నాగేష్ ట్యాబ్ లు పంపించేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో కూడా సంకేతిక విద్యను నేర్పించుటకు ప్రధాని నరేంద్ర మోడీ ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటి పెల్లి రాజు, స్థానిక బిజెపి మండల పార్టీ అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్, నాయకులు ఆల్క గణేష్, రమణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## చైల్డ్ కేర్ పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు

### నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**నిర్మల్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్లలో వసతి పొందుతున్న చిన్నారులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని 44 మంది అనాథ చిన్నారులకు ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. దీంతో వారు ప్రభుత్వంతో పాటు గుర్తింపు పొందిన ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా ఏకంగా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు పొందే అర్హత కలిగారని తెలిపారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో అనాథ చిన్నారులకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసిన రెండవ జిల్లా నిర్మల్ కావడం గర్వకారణమన్నారు.

## నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

**మందమర్రి, జూలై 15 (ప్రభాత సమాచారం)**

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని నిరుపేదలు సీఎంఆర్ఎఫ్ ను సద్వినియోగం చేసుకోవాలని మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందె రాంచందర్ కోరారు. మండలంలోని చిర్రకుంట గ్రామానికి చెందిన ఆగిడి లక్ష్మికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.60 వేల చెక్కును మంగళవారం ఆయన అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కొరకు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడుతుందని అన్నారు.



## అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**బెల్లంపల్లి, జూలై 15 (ప్రభాత సమాచారం)**

పెండింగ్‌లో ఉన్న బదిలీలు, పదోన్నతులు, పదవీ విరమణ, టీచర్లు ఆయాలకు బెనిఫిట్స్ వంటి ప్రధాన సమస్యలను వెంటనే చెల్లించాలనీ సీఐటీయూ నాయకులు డిమాండ్ శారు. మంగళవారం బెల్లంపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ స్వరూపకి అంగన్వాడి యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వినతి అందజేశారు. బెల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలోఉన్న అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భానుమతి, రాజమణి మాట్లాడుతూ...




తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేస్తామని అనేక హామీలు ఇచ్చిందనీ గుర్తు చేశారు. కానీ వాటిని మాత్రం అమలు చేయలేదనీ దుయ్యబట్టారు. వయసు పైబడిన వాళ్లను రిటైర్మెంట్ చేసిందనీ, కానీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ మాత్రం ఇంకా చెల్లించలేదనీ విమర్శించారు.. ఇప్పటికీ సంవత్సరం గడిచిన రిటర్మెంట్ బెనిఫిట్స్ రాకపోవడంతో అంగన్వాడి ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ ఆందోళన వ్యక్తం చేశారు. జీపీఎస్ ద్వారా ఫొటోలు పెట్టే విధానాన్ని విరమించుకోవాల ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ... అంగన్వాడి కేంద్రాలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఐసీడీఎస్ కు ప్రతియేటా బడ్జెట్‌ను తగ్గిస్తుందని విమర్శించారు.



## మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి
# ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

■ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జూలై 15 (ప్రభాత సమాచారం)**

మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాల ప్రాంతంలో నిర్మిస్తున్న ఇందిరా మహిళా భవన్ నిర్మాణ పనులను సందర్శించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం కొరకు అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా క్యాంటీన్ల ఏర్పాట్లు, పెరటి కోళ్ళ పెంపకం, డైరీ ఫామ్ ఇతర వ్యాపార అవకాశాలు కల్పించడంతో పాటు పెట్రోల్ బంక్ ఏర్పాటును ప్రోత్సహిస్తుందని తెలిపారు. జిల్లాలోని దండేపల్లి మండలంలో మహిళలకు చేయూతనిస్తూ ఇందిరా మహిళా శక్తి సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. ఇందిరా మహిళా భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని



సందర్శించి తరగతి గదులు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, అదనపు గదులు ఇతర సకల సదుపాయాలు కల్పించడం జరిగిందని, అనుభవజ్ఞులైన, నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యాబోధన అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాల సాధన దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, ఆహాయం తయారీ సమయంలో తాజా కూరగాయలు, నిత్యావసర సరుకులు వినియోగించాలని, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యార్థినులతో మాట్లాడుతూ పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులు సంస్థ అభివృద్ధికి పాటుపడాలి




**మందమర్రి, జూలై 15 (ప్రభాత సమాచారం)**

సింగరేణి భూగర్భ గనులలో విధులు నిర్వహించే కార్మికులు హాజరు శాతాన్ని పెంచి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని ఏరియా జిఎం జి.దేవేందర్ కోరారు. ఏరియాలోని సిఈఆర్ క్లబ్ లో మంగళవారం కాసిపేట 1, కాసిపేట 2 గనిలో విధులు నిర్వహిస్తూ 100 హాజర్లు పూర్తి చేయని కార్మికులకు నిర్వహించిన కుటుంబ సభ్యుల కౌన్సిలింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం అందరి అదృష్టమని, యువ కార్మికుల తల్లిదండ్రులు ఉద్యోగం చేసిన సమయంలో ఉన్న పరిస్థితులు ప్రస్తుతం లేవని, ప్రతి ఒక్క ఉద్యోగి తమ యొక్క హాజరు శాతాన్ని పెంచుకొని సంస్థ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని సూచించారు. సింగరేణి సంస్థ కల్పిస్తున్న సదుపాయాలు దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేవని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగులు ప్రతినెల 20 హాజర్లు పూర్తి చేయాలన్నారు.



## గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో
# వన మహోత్సవం

- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**నిర్మల్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఖానాపూర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భవిష్యత్ తరాలకు సురక్షిత పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆష్టా లిఫ్ట్ ఇరిగేషన్
# ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

**ముథోల్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ఆష్టా సరస్వతీ లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్ఫార్మర్ ను ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ ఎత్తుకెళ్లారు. స్థానికులు, రైతుల కథనం ప్రకారం.. లిఫ్ట్ పంప్ హౌస్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కింద పడడాన్ని, రైతులు, గమనించి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఐతే గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్ఫార్మర్‌ను పగుల గొట్టి అందులో ఉన్న దాదాపు రూ. 20లక్షల విలువ గల కాపర్‌ను దొంగిలించారని గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు సుమారు మూడు, నాలుగు రోజుల క్రితమే కాపర్ ను దొంగిలించి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ విషయమై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు.



# గల్ఫ్ బాధితునికి ఆర్థిక సాయం అందజేత

**జన్నారం, జూలై 15 (ప్రభాత సమాచారం)**

మండలంలోని కామన్ పల్లి గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన గల్ఫ్ కార్మికుడు కొలిమి కుంట్ల రామాచారి ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కామన్ పల్లి గ్రామ గల్ఫ్ సంక్షేమ సమితి సభ్యులు మంగళవారం బాధితుడికి రూ. 17800 సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కామన్ పల్లి గల్ఫ్ సంక్షేమ సమితి అధ్యక్షులు కోడిజుట్టు నరేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి రమేష్ మాట్లాడుతూ.. గల్ఫ్ బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. నిరుపేద కలపు కార్మికుల కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సాయం అందజేసిన తోటి గల్ఫ్ కార్మికులు, విషయం తెలుసుకున్న కామన్‌పల్లి గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి అధ్యక్షుడు నరేష్ ఆదేశాల మేరకు వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, సేవా భావంతో సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పంచర్ల మల్లేష్, వంగాల శేఖర్, ఓడిపేల్లి అర్జున్, కొలిమికుంట్ల లక్ష్మీపతి, జునుగురు భానుమూర్తి, సాట్ల సాయిశివ, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.



# జీవో 49ని రద్దు చేయాలని తహసీల్దార్‌కు వినతి

**బోథ్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం సోనాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్ రెడ్డి కి జీవో నెంబర్ 49 రద్దు చేయాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ.. జీవో నెంబర్ 49 ఆదివాసి అస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నది. కావున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో నెంబర్ 49 ని రద్దు చేయాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి తరఫున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. జీవో నెంబర్ 49 వల్ల ఆదివాసీలు చేసుకుంటున్న పోడు భూములపై హక్కులు కోల్పోతారు. ఈ ప్రాంతంలో దాదాపు 550 గ్రామాలు అక్కడి నుంచి తరలించే కుట్రలు




జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు జుగ్నక్ మారుతి, ఉప అధ్యక్షుడు జాకేష్, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# 800 లీటర్ల బెల్లం పాకం ధ్వంసం

**ఆసిఫాబాద్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి 800 వందల లీటర్ల బెల్లం పాకం ధ్వంసం చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. తిర్యాణి మండలంలోని ఇర్కపల్లి గుడుంబా తయారు చేస్తున్న వచ్చిన సమాచారం మేరకు మంగళవారందాడులు చేసి 800 లీటర్ల బెల్లం పాకాన్ని ధ్వంసం చేసి ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, దర్శాజల మహేష్, కనుకుంట్ల శ్రీకాంత్ అనే ఇద్దరుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.





# గిరిజన ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

- పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా పీవీటీజీ గిరిజనుల గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి
- కేంద్ర రోడ్డు రవాణా, రహదారులు, కార్పొరేట్ వ్యవహారాలశాఖ సహాయమంత్రి హర్ష మల్హోత్రా
- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటన
- ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధికారులతో సమీక్ష
- కేంద్ర మంత్రి పలు సమస్యలను నివేదించిన ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్ బాబు, కోవలక్ష్మి

**ఆసిఫాబాద్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

గిరిజన ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారులు, కార్పొరేట్ వ్యవహారాలశాఖ సహాయమంత్రి హర్ష మల్హోత్రా అన్నారు. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ నిధులు రూ. కోటి యాభై లక్షలతో నిర్మించిన కేంద్ర గ్రంథాలయాన్ని, ఎంపీడీవో కార్యాలయ అవరణలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇంటిని, మండలంలోని తుంపల్లి గ్రామంలో జల్ జీవన్ మిషన్ కింద నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై కోట్లాది రుపాయలు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. నిర్ణీత సమయంలో పథకాలు లబ్ధిదారులకు చేరే విధంగా అదికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లాలో అమలు చేసేందుకు, అర్హులకు లబ్ధి చేకూరే విధంగా కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో 117 అస్పిరేషనల్ జిల్లాలను గుర్తించిందని చెప్పారు. ఆసిఫాబాద్ జిల్లా కూడా అందులో ఎంపికైందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంకల్పం ప్రకారం ప్రతి అస్పిరేషనల్ జిల్లాలో నీతి ఆయోగ్ ద్వారా గిరిజనులకు మౌలిక వసతుల కల్పనకు క్షేత్రస్థాయిలో సమీక్షించేందుకు కేంద్ర మంత్రులు పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో భాగంగా పీవీటీజీ గిరిజనుల గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జాతీయ జల్ మీషన్ కింద శుద్ధమైన తాగునీటిని అందిస్తున్నామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వంద రోజుల పనిని కూలీలకు కల్పించాలని ప్రదానమంత్రి గ్రామీణ్ సడక్ యోజన కింద మంజూరైన రహదారుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పోషణ్ అభియాన్ కింద గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించాలన్నారు. అంతకు ముందు గ్రంథాలయంఆవరణలో మొక్కలు నాటారు. సంక్షేమ పథకాల పని తీరుపై లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఏఎస్పీ చిత్తరంజన్, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్ల, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీష్‌బాబు పాల్గొన్నారు. జిల్లాలో కన్జర్వేషన్ రిజర్వ్ టైగర్ కారిడార్ ఏర్పాటు కోసం తీసుకు వచ్చిన జీవో 49ని రద్దు చేయాలని, జిల్లాలో అటవీశాఖ అనుమతులు లేకుండా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఐటీడీఏ పరిధిలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని వాటికి అనుమతులు ఇప్పించాలని వినతిపత్రాలు అందజేశారు. అస్పిరేషన్ ప్రాంతమైన తిర్యాణి మండలంలో వంతెనలు, కల్వర్టులు, రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కేంద్ర మంత్రికి విన్నవించారు. కరోనా సమయం నుంచి జర్నలిస్టులకు నిలిపివేసిన 50 శాతం రైల్వే ప్రయాణ రాయితీని పునరుద్ధంచాలని, టోల్‌టాక్స్‌లో మినహాయింపు ఇవ్వాలని జర్నలిస్టులు కేంద్రమంత్రికి వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఫారెస్టును ఏర్పాటును విరమించుకోవాలని జీవో 49 రద్దు చేయాలని సీపీఎం నాయకులు దినకర్, శ్రీనివాస్, రాజేందర్, మాలశ్రీ, కార్తీక్ వినతపత్రం అందజేశారు.







## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని
# వేగవంతం చేయాలి

**మామడ, జూలై 15 (ప్రభాత సమాచారం)**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీవో సుశీల్ రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం మండలంలోని పొన్కల్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇండ్లు నిర్మించుకుంటున్నవారికి దశలవారీగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. మంజూరైన ఇండ్లు బేస్మెంట్ లెవల్‌కు చేరాలని, ఏమైనా సమస్యలు ఉంటే అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ఆసిఫాబాద్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

పేకాట స్థావరంపై టాస్కోఫోర్స్ పోలీసుల దాడి చేసి నలుగురిని అదుపులో తీసుకున్నట్లు సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. ఆసిఫాబాద్ మండలంలోని బుందల్ ఘాట్ పెద్దవాగు సమీపంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్కోఫోర్స్ పోలీసులు దాడి చేసి ఆసిఫాబాద్‌కు చెందిన పురుషోత్తం, ఇమ్రాన్ ఖాన్, గౌస్ సిద్ధికి. వాంకిడికి చెందిన ఉడుతల భీమయ్య అనే నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 6800 రూపాయలు. సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



# సింగరేణి రిటైర్డ్ కార్మికులకు క్వార్టర్లు ఇవ్వాలి



**మందమర్రి, జూలై 15 (ప్రభాత సమాచారం)**

సింగరేణి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన సింగరేణి రిటైర్డ్, మెడికల్ ఇన్ వ్యాలిడేషన్ అయిన కార్మికులకు సింగరేణి యాజమాన్యం మిగిలి ఉన్న క్వార్టర్ లను కేటాయించాలని లేదా 150 గజాల స్థలాన్ని కేటాయించాలని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల కార్మిక సంఘం నాయకులు కోరారు. మంగళవారం పట్టణ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... 11వ వేతన ఒప్పందంలో పెరిగిన వేతనాల ప్రకారం 2021 తర్వాత దిగిపోయిన కార్మికులకు పెరిగిన రివైజ్డ్ పెన్షన్ ను మూడు దఫాలుగా అందజేయడం జరిగిందని, మిగిలిన వారికి సైతం పెరిగిన పెన్షన్ ఆర్డర్ కాపీలు వారి వారి గనులపై ఇవ్వడం జరుగుతుందని రిటైర్డ్ కార్మికులు గమనించాలని సూచించారు. అదేవిధంగా పెన్షన్ ఆర్డర్ కాపీలు రాని రిటైర్డ్ కార్మికులకు సైతం త్వరలోనే ఆర్డర్ కాపీలు అందజేయడం జరుగుతుందని ఆందోళన చెందవద్దని తెలిపారు. అంబికా దర్బార్ బత్తి సంస్థ తన సంస్థలో 15 సంవత్సరాల పని చేసిన కార్మికులకు ఇల్లు నిర్మించి, అందిస్తుందని అదేవిధంగా సింగరేణిలో 30,35 సంవత్సరాలు పని చేసిన రిటైర్డ్ కార్మికులకు సైతం సింగరేణి యాజమాన్యం సొంతింటిని కలను సాకారం చేయాలని కోరారు. ఏరియాలోని కేకే డిస్పెన్సరీలో రిటైర్డ్ కార్మికుల సౌకర్యార్థం ఫిజియోథెరపీ సేవలు, 2డికో సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సింగరేణిలో గోల్డెన్ సెకండ్ పథకం ద్వారా పదవి విరమణ పొందిన కార్మికులకు మానవత దృక్పథ్యంతో వైద్య సేవలు, మందులు అందించాలన్నారు. అదేవిధంగా ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వారికి ఎల్పి ఎనిమిది లక్షలు 10 లక్షలు పెంచడం జరిగిందని వెంటనే దానికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సింగరేణి మెడికల్ బోర్డులో అవినీతి జరిగిందని గత కొద్ది రోజులుగా మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం తగదని, వెంటనే యధావిధిగా మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# సైబర్ వలలో చిక్కుకోకండి

## 'గోల్డెన్ అవర్' దాటకముందే 1930కి కాల్ చేయండి

**చెన్నూర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసగాళ్ల వలలో పడవద్దని చెన్నూర్ పట్టణ సీఐ దేవేందర్ రావు సూచించారు. మోసపోయామని తెలిసిన వెంటనే సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. పట్టణంలోని ఆదర్శ్ నగర్ కు చెందిన రత్న రాజేశ్ రెడ్డి కొద్ది రోజుల క్రితం సైబర్ నేరస్థుల చేతిలో మోసపోయి రూ.50 వేలు పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే పోలీసు స్టేషన్‌కు వెళ్లి తన సమస్యను వివరించాడు. దీంతో చెన్నూర్ టౌన్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు పి.దేవేందర్ రావు ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు ఫైల్ చేశారు. ఇన్వెస్టిగేషన్ చేసి సైబర్ మోసగాడి బ్యాంకు ఖాతా నుంచి బాధితుడు రాజేశ్ రెడ్డి అక్కౌంట్‌కు 16 వేల రూపాయలు జమ చేయించారు. మనీ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ కాపీని మంగళవారం బాధితుడికి సీఐ దేవేందర్ రావు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ మోసగాళ్ళ వలలో పడకుండా జాగ్రతగా ఉండాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ క్రైమ్ బారిన పడితే గంటలోపే 1930 కి కాల్ చేయాలని చెప్పారు. ఈ కీలక కాలాన్ని 'గోల్డెన్ అవర్' అని అంటారని సీఐ తెలిపారు. రత్న రాజేశ్వర్ రెడ్డి ఫిర్యాదు అనంతరం ఇన్వెస్టిగేషన్‌లో ముఖ్య పాత్ర పోషించిన సైబర్ వారియర్ ఎన్. జీవన్ రావును సీఐ దేవేందర్ అభినందించారు.



## పాఠశాలను తనిఖీ చేసిన
# జిల్లా విద్యాశాఖ అధికారి

**సోన్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

సోన్ మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం పాఠశాలకు వెళ్లిన ఆయన హాజరు పట్టికను పరిశీలించి విద్యా బోధన మధ్యాహ్న భోజన పథకం ఉచిత పాఠ పుస్తకాల పంపిణీ తదితర అంశాలపై చర్చించారు.





# ప్రతీ వాహనానికి నెంబర్ ప్లేట్ తప్పనిసరి

■ నిబంధనలు పాటించనివారిపై కఠిన చర్యలు
■ మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్

**మంచిర్యాల, జూలై 15 (ప్రభాత సమాచారం)**
వాహనాలకు సరైన నెంబర్ ప్లేట్లు కచ్చితంగా ఉండాలని మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు, పలు ఏరియాల్లో పట్టణ సీఐ ప్రమోద్ రావు ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ సిబ్బందితో వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు, వాటిని గుర్తించి అక్కడికక్కడే నెంబర్ ప్లేట్ ఫిట్ చేయించి పైన్లు వేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా కావాలని నెంబర్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన వారు ఉన్న, నాలుగు అంకెల నెంబర్లను రెండు అంకెల నెంబర్‌గా మార్చి చెక్కర్లు కొడుతున్న వారిని గుర్తించి వారిపై చీటింగ్ కేసులు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. నెంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేయడం ద్వారా దొంగతనాలకు పాల్పడుతున్నారని, ఈ మధ్య కాలంలో బెల్లంపల్లి లో జరిగిన ఏటీఎం చోరీ కేసులో దొంగలు నెంబర్ లేని వాహనాన్ని వినియోగించారని పోలీసులు గుర్తించి వారిని పట్టుకున్న ఘటనను గుర్తు చేశారు. అలాంటి పరిస్థితులు పునరావృతం కాకూడదనే ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రి 10 తరువాత అత్యవసరం ఉన్న వారు తప్ప ఎవరు అనవసరంగా బయట తిరగవద్దని హెచ్చరించారు. రాత్రి పూట వాహనాలు తనిఖీ చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు. కొంత మంది గంజాయి అలవాటు పడి ఆ మత్తులో దాడులకు పాల్పడుతున్నట్లు, వారి మీద ప్రత్యేక నిఘా ఉందని, పాత నేరస్థుల ఇండ్లకు సైతం వెళ్లి కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఎవరు కూడా నేరాలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ముజురుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

**నస్పూర్‌లో 25 ద్విచక్ర వాహనాల సీజ్...**
నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నంబర్లు లేకుండా రోడ్లపై తిరుగుతున్న ద్విచక్ర వాహనాలపై పోలీసులు కొరఢా ఝుళిపించారు. సీసీసీ కార్నర్ వద్ద మంగళవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నంబరు లేని 25 వాహనాలను సీజ్ చేశారు. వాహనాదా రులకు, మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. తనిఖీలో రూరల్ సీఐ అశోక్, ఎస్సై ఉపేందర్ రావు, పాల్గొన్నారు.





## పాత్రికేయుల పాత్ర కీలకం

**నిర్మల్, జూలై 15 (ప్రభాత సమాచారం)**
సమాజ అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర కీలకమని ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తి అన్నారు. నిర్మల్ ప్రెస్‌క్లబ్‌కు మంగళవారం బ్లూ స్టార్ వాటర్ ఫిల్టర్‌ను అందించారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు సాద అరవింద్ ఐదు ఫ్యాన్లు విరాళంగా అందించారు. పాత్రికే యులకు చేయూతనందించేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు నిర్మల్ ప్రెస్‌క్లబ్ సభ్యులు సన్మానం చేశారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

**కాగజ్‌నగర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**
లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఈస్‌గావ్ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేసింది. విద్యకు ప్రాధాన్యత నిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు బేసిక్ స్టేషనరీ అవసరమని పేర్కొంది. "విద్య ఉజ్వల భవిష్యత్తుకు పునాది" అనే నినాదంతో ఈ చర్య చేపట్టింది.



## ఏపిఓను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**మందమర్రి, జూలై 15 (ప్రభాత సమాచారం)**
గ్రామీణ ఉపాధి హామీ పథకం మండల ఏపీవో రజియా సుల్తానను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయం లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఇటీవల డాక్టరేట్ సాధించిన ఈజిఎస్ ఎపివో రజియాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎన్.రాజేశ్వర్ మాట్లాడుతూ... గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఏపీఓ గా విధులు నిర్వహిస్తూ నిరుపేదలకు ఉపాధి కల్పించడమే కాకుండా, వారి కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి డాక్టరేట్ సాధించడం గర్వకారణం అన్నారు. మండలంలోని ప్రతి అధికారి తమవంతుగా సామాజిక సేవ చేసి ప్రజల మన్ననలు పొందా లని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల ఇంచార్జ్ జీవన్ కుమార్, నాయకులు మాసు సంతోష్ కుమార్, రాజన్న కాపురపు సతీష్, నీలం ఆనంద్, రేగుంట రాజయ్య, ఉప్పరి శ్రీనులు పాల్గొన్నారు.



## విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అవసరం




**నిర్మల్, జూలై 15 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ పట్టణంలోని స్థానిక విజయ ఉన్నత పాఠశాలలో విద్యార్థి పాలకవర్గ ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థిని-విద్యార్థులకు ఎన్నికల పట్ల అవగాహన, ఓటు హక్కు ప్రాధాన్యత, నామినేషన్లు దాఖలు చేయడం, బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం, ఓట్ల లెక్కింపు తదితర విషయాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఓటర్లుగా తగిన అభ్యర్థిని ఎన్నుకోవడానికి వారి యొక్క ఓటు అనే బాధ్యతని సద్వినియోగపరు కోవాలని సిఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. పాఠశాల సెక్రెటరీ అయ్యన్న భూమయ్య మాట్లాడుతూ... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశం అని, న్యాయకత్వ లక్షణాలు పెంపొందించుకో వాలని బాధ్యతని తప్పకుండా నిర్వహించాలని తెలిపారు.





## తీన్మార్ మల్లన్నపై దాడి సిగ్గుచేటు

**మందమర్రి, జూలై 15 (ప్రభాత సమాచారం)**
ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అనుచరులు చేసిన దాడిని ఖండిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు మంగళవారం జాతీయ బీసీ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిళ్ల శ్రీనివాస్ మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు బీసీల కోసం ఆలోచించని వాళ్ళు నేడు బీసీల పట్ల కపట ప్రేమను చూపిస్తూ బీసీల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. బీసీ బిడ్డ మీద చేసిన దాడిని బీసీలందరు ముక్త కంఠంతో ఖండించాలని కోరారు. తెలంగాణ యాస, భాషల పట్ల అవగాహన లేని వాళ్ళు నేడు బీసీ బిడ్డ చట్ట సభల్లో కూర్చుంటే ఓర్వలేక అనగదొక్కే కుట్రలను తెలంగాణ సమాజం గమనిస్తుందని, ఇకనైన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు.

## 130 గ్రాముల గంజాయి స్వాధీనం

**నెన్నెల, జూలై 15 (ప్రభాత సమాచారం)**
నెన్నల మండలం జెండా వెంకటాపుర్ గ్రామానికి చెందిన ఎస్కూరి శశి కుమార్(19) అనే వ్యక్తి గంజాయి సేవిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. నెన్నల ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. జెండా వెంకటాపుర్ గ్రామ శివారులో ఉన్న మామిడి తోటలో గంజాయి తాగుతున్నానే సమాచారం మేరకు వెళ్లి దాడి చెయ్యగా అక్కడ శశి కుమార్ దొరికాడు. అతని చేతిలో ఒక కవర్ లో 130 గ్రాముల గంజాయి లభించింది. శశి కుమార్ ను విచరించగా గంజాయిని భీమారం మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన ఆకుదరి రాకేష్ అమ్మినట్లు చెప్పాడు. ఈ మేరకు అతనిపై కూడా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# జీవో నంబర్ 49 రద్దు చేయాలి : ఆదివాసీ హక్కుల పోరాట సమితి

**తాండూర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**
ఆదివాసీల అస్థిత్వాన్ని దెబ్బతీసే విధంగా, ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ఉన్న జీవో నంబర్ 49ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ, కొలవార్, తోటి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం తాండూర్ తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీల జీవితాలతో బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆడుతున్న చెలగాటం మానుకోవాలి అన్నారు. 49 జీవో అమలు వల్ల ఆదివాసులు సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కొల్పోతారని.. ఇది జాతి మనుగడకే దెబ్బతీసే విధంగా ఉంది. కాబట్టి ఇట్టి విషయాన్ని పరిగణలోకి తీసుకోని 49 జీవోను వెంటనే రద్దు చేయాలని వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. లేని యెడల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు యాపల సమ్మయ్య, గడ్డం మణికుమార్, అవుడే మల్లేష్, అరికల శంకర్, నాయిని హన్మంతు, నాయిడి బాపు, రాజం, సురేష్ పాల్గొన్నారు.





## అంతడుపుల నాగరాజుకు

# ఘన సన్మానం

**మందమర్రి, జూలై 15 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యుడిగా నియమితులై తొలిసారి పట్టణానికి విచ్చేసిన అంతడుపుల నాగరాజుకు పట్టణ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాండ్ల సంజీవ్, ప్రధాన కార్యదర్శి కడారి శ్రీధర్ తో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు మాట్లాడారు. నాగరాజుతో వారికున్న పరిచయాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ ధూంధాంను ఏర్పాటు చేసి, తెలంగాణ భావవ్యాప్తికి, ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడడానికి నాగరాజు చేసిన సేవలను కొనియాడారు. అదేవిధంగా కళాకారుడిగా ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చూపిన చొరవను ప్రశంసించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ, తెలంగాణ మలిదశ ఉద్యమంలో అనేక మంది కళాకారులు, ఉద్యమ కారులు తమ జీవితాన్ని త్యాగం చేసి, రాష్ట్ర సాధన కోసం ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. స్వరాష్ట్ర సాధనలో కళాకారుల పాత్ర చిరస్మరణీయమని తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యమకారుల త్యాగాన్ని విస్మరిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వారిని గుర్తించి, ప్రత్యేక గుర్తింపు అందించి, అక్కున చేర్చుకుంటుందని కొనియాడారు. పదవి ఏదైనా ఇన్నేళ్ల తన శ్రమకు దక్కిన గౌరవమని భావోద్వేగానికి లోనయ్యారు. నటరాజ్ కళా నిలయం నుండి మొదలైన తన కళా ప్రస్థానంలో ఎందరో కళాకారులు, సన్నిహితులు, తన వెన్నంటి నడచి, ప్రోత్సహించారని తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ సలహా సభ్యుడిగా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా ప్రజా ఆకాంక్షలు నెరవేరని పక్షంలో మరల తన కళారూపంలో ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకువెళ్తానని, పదవులు ఉన్నా లేకున్నా ఎల్లప్పుడు ప్రజలతోనే తన ప్రయాణం అని స్పష్టం చేశారు.

# అక్రమ కేసులకు భయపడేది లేదు

**కోటపల్లి, జూలై 15 (ప్రభాత సమాచారం)**

కోటపల్లి మండలం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అన్నింటిని బేషరతులు లేకుండా నెరవేర్చాలని నెరవేర్చాలని ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టడంతో సోమవారం రోజున చెన్నూర్ సివిల్ కోర్టులో బీఆర్ఎస్ వి నాయకులు అజరు కావడం జరిగింది. ఈసందర్భంగా బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరి చెట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ.. అక్రమ కేసులతో ప్రభుత్వన్ని నడుపాలేరు బి ఆర్ ఎస్ నాయకులుపై అక్రమ కేసులు పెట్టడం సరి అయిన పద్ధతి కాదు అని బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు మరి చేట్టి విద్యాసాగర్ అన్నారు. రైతులకు న్యాయం జరిగే అంత వరకు పోరాడుతునే ఉంటామని తెలిపారు. మీరు ఏన్ని అక్రమ కేసులు పెట్టిన తగ్గేదే లేదు బి ఆర్ ఎస్ నాయకులు వెల్లడించారు.



## కల్లు దుకాణాలపై

# ఎక్సైజ్ శాఖ అధికారుల దాడి

**తలమడుగు, జూలై 15 (ప్రభాత సమాచారం)**

కోడద్ గ్రామంలోని కల్లు దుకాణంపై మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడి చేసి 80 లీటర్ల తెల్లకల్లును పట్టు కొని షాపును సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ విజేందర్ మాట్లాడుతూ సోమవారం కోడద్ గ్రామస్తులు కలెక్టరును కలిసి ఫిర్యాదు చేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు దాడులు చేసి కల్లును పరీక్షల నిమిత్తం శాంపిల్ సేకరించించినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా రసాయనలతో తయారుచేసిన తెల్లకల్లు ను విక్రయించినట్లయితే విక్రయిదారుల లైసెన్స్ రద్దు తో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడిలో ఎక్సైజ్ కానిస్టేబుల్ సుదాం ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## చదువు ఇష్టం లేదని

# విద్యార్థి ఆత్మహత్య

## సిర్పూర్ మండలంలో ఘటన

**సిర్పూర్ (టి), జూలై 15 (ప్రభాత సమాచారం)**



సిర్పూర్ మండలం లింకుగూడ గ్రామానికి చెందిన సుర్పం శేఖర్ (17) మంగళవారం తన చేనులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కమలాకర్ తెలిపిన ప్రకారం.. ఆసిఫాబాద్‌లోని పిటిజి కళాశాలలో ఇటీవల కుటుంబ సభ్యులు చేర్పించారు. రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చి తాను చదువుకో నని చదువు ఇష్టం లేదని పేర్కొన్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు భవిష్యత్తు బాగుపడుతుందని సముదా యించినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి తిరిగి కపోవడంతో తమ చేను వైపు వెళ్లి చూడగా చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని ఉన్నట్లు తెలిపారు. తండ్రి యాదవ్ ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## వన మహోత్సవంలో అందరూ

# భాగస్వాములు కావాలి

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**నార్నూర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

నార్నూర్ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మెగా వనమహోత్సవం కార్యక్రమంలో 500 మొక్కలు సామూహిక కార్యక్రమంలో, ఏకలవ్య స్కూల్‌లో మంగళవారం మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా పచ్చదనాన్ని పెంపొందిస్తూ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకర పర్యావరణం అందించాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. నార్నూరు మండలం లో విస్తృతంగా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 500 మొక్కలు మోడల్ స్కూల్, ఏకలవ్య స్కూల్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత గురించి ఎవరికి వారు గుర్తిస్తూ, విధిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కల వల్ల పర్యావరణ సమతుల్యం కాపాడడంతో పాటు పచ్చదనం పెరిగి సకాలంలో వర్షాలు కురుస్తాయని, జీవ కోటికి స్వచ్ఛమైన ప్రాణ వాయువు లభిస్తుందని గుర్తు చేశారు. ఇది మనకే కాకుండా మన భవిష్యత్ తరాలకు కూడా ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మొక్కల పెంపకానికి ప్రాధాన్యతను ఇస్తూ పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తోందన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగానే కాకుండా, మన అవసరాల రీత్యా కూడా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటి పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రవిందర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంపిడిఓ, తదితరులు పాల్గొన్నారు.



## భూమి నాశనమవుతుంది..

# నిజం.. అది విషం..!



- బయోమందుల పేరుతో భారీగా దోపిడీ
- రైతులు ప్రాణాలను బలిగొంటున్న వ్యాపారులు
- కలుపు నివారణే ధ్యేయంగా పంటల్లో వినియోగం
- కూలీల ఖర్చులు మిగులుతాయని రైతుల ఆశ
- ధనార్జనే ధ్యేయంగా పలువురు వ్యాపారుల దందా
- పట్టించుకోని వ్యవసాయశాఖ

**ఆదిలాబాద్ ప్రతినిధి, జూలై 15 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ పంటలు ఏపుగా పెరిగాయి. రైతుల ఆశలను చిగురింప జేస్తున్నాయి. పంటలను ఆశించే తెగుళ్లను నివారించేందుకు, పంట ఏపుగా పెరిగి మరింత దిగుబడి వచ్చేందుకు రైతులు క్రిమిసంహారక మందులు ఎరువులు ఉపయోగించడం పరిపాటే. అయితే జిల్లాలో రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని వ్యాపారులు రైతులను నిలువెల్లా దోచుకుంటున్నారు. బయోమెదుల పేరిట అవసరం లేని మందులను అంటగట్టి భారీ దోపిడికి పాల్పడుతున్నారు. ప్రముఖ కంపెనీల పేరుతో నకిలి మందులను అంటగడుతున్నారు. వ్యవసాయంలో తలా మునకలై ఉన్నదంతా పెట్టుబడిగా పెట్టి పంటలపై ఆశలు పెట్టుకున్న రైతులకు మందుల వ్యాపారులు నిలువెల్లా దోచుకుంటున్నారు. మందులవ్యాపారుల కంబద హస్తాల్లో చి క్కి రైతన్న విలవిలలాడుతున్నాడు. నకిలి మందులను అరికట్టడంలో వ్యవసాయశాఖ పూర్తిగా విఫలమైంది. రైతులు అడుగడ ుగున నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 17 న్నర లక్షల ఎకరాల భూమిలో వివిధ పంటలు సాగవుతున్నాయి. ఈపంటలకు 35 లక్షల మీటర్ల పురుగుల మందు అవసరం ఉంటుందని వ్యవసాయశాఖాధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో ప్రధానంగా పత్తి, సోయా పంటలు సాగవుతున్నాయి. ఆతర్వాత స్థానంలో కంది వరి సాగవుతుంది. ప్రస్తుతం పంటలు పూత దశలో ఉన్నాయి. ఈసమయంలోనే పంట లు తెగుళ్ల బారిన పడుతాయి. ఇప్పుడే రైతులకు క్రిమిసంహారక మందులు, ఎరువులు అవసరం ఉంటాయి. అయితే ఈ అవకాశాన్ని వ్యాపారులు తమకు అనుకూల ంగా మార్చుకుంటున్నారు. వీటి కోసం రైతులు తమకు తెలిసిన వ్యాపారులపైనే ఆధారపడుతుండటంతో వారు వారిని నమ్మించి తమకు తోచిన మందులను రైతులకు అంటగడుతున్నారు. పంటలో ఉండే కలుపు నివారణకు వాడే కొన్ని మందులను కేంద్రప్రభుత్వం నిషేదించిన జిల్లాలో యదేచ్ఛగా అమ్ముతున్నారు. పురుగుల మందులు ఎరువులు అమ్మే దుకాణాలను అధికారులు నామమా త్రంగా తనిఖీలు చేస్తున్నారు. మామూళ్లకు అలవాటు బపడ్డ వ్యవసాయ శాఖాధికారులు రైతుల ప్రయోజనాలను పనంగా పెడుతున్నారు. దీంతో నకిలి మందులు బయోమందుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఆదిలాబాద్ తోపాటు పరిసర ప్రాంతాల్లో అక్రమంగా బయోక్రిమిసంహారక మందులు యదేచ్ఛగా విక్రయాలు జరుగుతున్నప్పటికి వ్యవసాయాధికారులు సీడ్స్, ఫెస్టిసైడ్ అండ్ ఫర్టిలైజర్ దుకాణాలపై కన్నెత్తి చూడటం లేదు. అడపా దడపా తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికి ఎక్కడ పూర్తిస్థాయిలో తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ప్రభుత్వం బయోక్రిమిసంహారక మందులను నిషేదించినప్పటికి ఆ మందులను విచ్చల విడిగా ఆదిలాబాద్‌లో విక్రయాలు జరుపుతున్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్‌లోని గంజ్ రోడ్, పంజాబ్ చౌరస్తా, అంబేద్కర్ చౌక్, గాంధీ, శివాజీ చౌక్, వినాయక్ చౌక్ తదితర ప్రాంతాల్లో విచ్చల విడిగా బయో క్రిమిసంహారక మందులు విక్రయాలు జరుపుతున్నారు. ప్రతీ సంవత్సరం జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో విజిలెన్స్ అధి కారులు క్రిమిసంహారక మందుల దుకాణాలపై తనిఖీలు చేసేవారు. ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్, ఇంద్రవెల్లి, నార్నూర్, బేల, జైనథ్, తాంసి, తలమడుగు మండలాల్లో అక్రమంగా బయో క్రిమిసంహారక మందులతో పాటు అక్రమంగా నకిలి క్రిమిసంహారక మందులు యదేచ్ఛగా విక్రయాలు జరుపు తున్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఎటువంటి లైసెన్సులు లేకుండానే కొందరు కమిషన్ ఎజెంట్లు అక్రమంగా క్రిమిసంహారక మందులు , ఎరువుల విక్రయాలు జరుపుతున్నారు. ఆదిలాబాద్ మార్కెట్‌లో లభ్యమయ్యే క్రిమిసంహారక మందులుఏవి అసలు, ఏవి నకిలి తెలియక రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంతవరకు ఆబోర్డులో మందుల వివరాలు లేవు. నిషేదిత మందుల విక్రయాలపై ఉక్కుపాదం మోపాల్సిన వ్యవసాయాధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోయాయి. మందులు, ఎరువుల వాడకంలో రైతులను చైతన్యపర్చడంలో వ్యవసాయాధికారులు విఫలం కావడం తో రైతులు నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఉంది.

# వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలి

**మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్**

**మంచిర్యాల, జూలై 15 (ప్రభాత సమాచారం)**

కీటక జనిత వ్యాధులైన మలేరియా, చికెన్ గున్యా,డెంగ్యూ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్యాధికారులు వీటిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం హ మాలీవాడలోని బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత దవాఖానా పరిధిలో ఉన్న ప్రజ టలకు రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి రోగాలు ఉంటే చికిత్స అందించా లన్నారు. టీ హబ్ ద్వారా రిపోర్టులను వేగంగా తెప్పించుకుని మందులను పంపిణీ చేయాల న్నారు. ఆరోగ్య కార్యకర్తలు, నర్సింగ్ ఆఫీసర్లు ప్రజలకు అందు బాటులో ఉంటూ వైద్యం అం దించాలన్నారు. సీజనల్ వ్యాధు లు ప్రబలకుం డా ప్రజలందరు ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు పె రగకుండా నియంత్రించాలన్నారు. పిల్లలకు టీ కాలను సకాలంలో ఇప్పించాలని సూచించా రు. బస్తీ దవాఖానాలో ఆర్‌డీ కిట్ల ద్వారా పరీ క్షలు చేయాలని, ఎప్పటికప్పుడు వాటి వివరాలను అందించాలన్నారు. సిబ్బంది కొరత ఉంటే తమ దృష్టికి



తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి రమ్య, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## మోటివేషన్‌పై అవగాహన

**నిర్మల్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల విద్యార్థులకు మోటివేషన్ తరగతులను నిర్వహించారు. ప్రతిరోజు పాఠశాలకు రావాలని కష్టపడి చదువుకొని మంచి మార్కులు తెచ్చుకోవాలని మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ ప్రజావాణి సద్వినించుకోండి



**ముథోల్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బైంసాలో బుధవారం నిర్వ హించి పోలీసుల ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినిం చుకోవాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి వచ్చిన వర్జిలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినించుకోవాలని కోరారు.

## రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

**బెజ్జూర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

బెజ్జూరు, దహెగాం మండలాల్లో ప్రాణహిత వరదల వలన నష్టపోయిన పత్తి రైతులకు నష్టపరిహారం చెల్లిం చాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బెజ్జూరు, దహెగాం మండలాల్లో గత వారం ప్రాణహిత నది వరదల కార ణంగా మూడు వేల ఎకరాల పత్తి పంటకు నష్టం జరి గిందని, పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని మంత్రిని కోరారు. దీనికి మంత్రి స్పందిస్తూ విపత్తుల నిర్వహణ ప్రిన్సిపల్ సెక్రెటరీకి తగిన ఆదేశాలు ఇవ్వడం జరిగిందనిత తెలిపారు.

## కన్నెపల్లి ఎంపీడీవోగా శ్రీనివాస్ రెడ్డి

**కన్నెపల్లి, జూలై 15 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మం గళవారం ఎంపీడీవో గా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరిం చారు. వేమనపల్లి మండలం ఎంపీఓ గా విధులు నిర్వహిస్తూ కన్నెపల్లి మండల ఎంపీడీవోగా అదనపు బాధ్యతలను చేప ట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎంపీడీవో శంకరయ్య ను సరెండర్ చేయడంతో ఎంపీడీవో స్థానం ఖాళీగా ఉండటంతో మంగళవారం నూతన ఎంపీడీవో గా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## పట్టిబడిన అంబులెన్స్ డ్రైవర్

**మంచిర్యాల, జూలై 15 (ప్రభాత సమాచారం)**

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో అంబులెన్స్ పట్టుబడిన సంఘటన మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేయగా అంబులెన్స్ డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపినట్టు తేలిందని ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. సదరు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

# మంచిర్యాలలో జంక్షన్ల కూల్చివేత



**మంచిర్యాల, జూలై 15 (ప్రభాత సమాచారం)**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంచిర్యాల పట్టణంలో రూ.4కోట్ల వ్యయంతో రెండేళ్ల క్రితం ప్రధాన కూడళ్లలో నిర్మించిన జంక్షన్లను కూల్చివేస్తున్నారు. లక్ష్మి థియేటర్, టీటీడీ కల్యాణ మండపం చౌరస్తాల వద్ద నిర్మించిన వృత్తాకార జంక్షన్లను మంగళవారం అధికారులు జేసీబీల సాయంతో కూల్చివేశారు. ఈ ప్రాంతాల్లో రోడ్లను విస్తరించాల్సి ఉందన్న దృష్ట్యా పెద్దసైజు ఐలాండ్లు ట్రాఫిక్‌కు అడ్డంకి మారుతు న్నాయని భావించి, వాటిని తొలగించి చిన్న సైజు జంక్షన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇదే తరహాలో ఐబీ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తాల్లోను ఇటీవల మా ర్పులు చేపట్టారు. గతంలో ఒక్కో జంక్షన్‌కు కోటి రూపాయల చొప్పున ఖర్చుపెట్టి గ్రీనరీ, శిల్పాలు, ఫౌంటెన్లు, లైటింగ్‌తో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అవసరం లేకుండా ట్రాఫిక్ నియంత్రణకు వీటిని నిర్మించినట్లు అప్పటి ప్రణాళిక. ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఇవి అవసరానికి మంచి ఉండడంతో, నగరశ్రేణి పెరుగుదలకు కొత్త ప్రణాళికలు అమలులోకి వస్తున్నాయి.



## టీసీఏలకు అధికారాలు ఇవ్వండి

**బెల్లంపల్లి, జూలై 15 (ప్రభాత సమాచారం)**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిన నేపథ్యంలో తెలంగాణ క్రికెట్ అసోసి యేషన్‌కు అధికార పగ్గాలను అప్పగించాలని మంచి ర్యాల జిల్లా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఇన్చార్జి పైడిమల్ల నర్సింగ్ కోరారు. మంగళవారం బెల్లంప ల్లిలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ క్రికెట్ అసోసి యేషన్ అధ్యక్షుడు రూ.170 కోట్ల అవినీతితో హైదరా బాద్ క్రికెట్ అసోసియేషన్ నిజాయితీ బయటపడిందని ఆయన విమర్శించారు. బీసీసీఐ ప్రతి ఏడాది రూ.100 కోట్లలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కు అందజేస్తుందని, అయితే ఈ నిధులను తెలంగాణలోని ఏ జిల్లాలో కూడా ఖర్చు చేయలేదని పేర్కొన్నారు. ఒక వేళ ఖర్చు చేస్తే ఏ జిల్లాలో టర్ఫ్ పిచ్ లను ఏర్పాటు చేశారో? ఎక్కడ మ్యాట్లు, నెట్లు ఏర్పాటు చేశారో? ఎం త మంది క్రీడాకారులకు శిక్షణ ఇప్పించి పైకి తీసు కువచ్చారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. హెచ్సీ ఏ మారుమూల ప్రాంతాల క్రీడాకారులను అసలు పట్టిం చుకోలేదని ఆరోపించారు. నిధుల అవినీతికి పాల్పడి దుర్వినియోగం చేశారని పైడిమల్ల నర్సింగ్ విమర్శిం చారు. మంచిర్యాల జిల్లా కోఆర్డినేటర్ అల్లం వెంకటే శ్వర్లు, జాడి శేఖర్, గౌతం క్రీడాకారులు ఉన్నారు.

## మహిళల హక్కులను పరిరక్షించాలి

**ఆసిఫాబాద్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

మహిళల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటుపడాలని జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు, నిరో ధానికి 2013లో ప్రభుత్వం చట్టం తీసుకు వచ్చింద న్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో, ఇంటర్నల్ కంప్లైట్స్ కమిటీ ఏర్పా టును చేసే మహిళల ఆత్మగౌరవం కాపాడే విధంగా చట్టాన్ని రూపొందించిందని చెప్పారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం సిబ్బందితో జిల్లాలో కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. అన్ని సంస్థల వారు సహకరించాలని కోరారు. ఈ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు.త

# దివ్యాంగులను ప్రోత్సహిద్దాం

**నిర్మల్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

వైకల్యం ఉందని దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దని, వారికి కొంత ప్రోత్సాహమిస్తే సకలాంగులతో సమానంగా ఏదైనా సాధించగలరని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా న్యాయసేవాసంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్లో మంగళవారం దివ్యాంగశక్తి ఫౌండేషన్ మూడోవార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, స్వయంగా దివ్యాంగుడైన పంచగుడి మహేశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా పదోతరగతి, ఇంటర్లో ఉత్తమ మార్కులను సాధించిన దివ్యాంగులకు ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్స్ అందించారు. దివ్యాంగుల కోసం సేవలందించిన వారికి దివ్యాంగమిత్ర విశిష్ట పురస్కారాలతో సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ దివ్యాంగుల్లోనూ అంతర్లీనంగా అద్భుతశక్తి ఉంటుందన్నారు. కాస్తంత ప్రోత్సహిస్తే వారూ అన్నింట్లో రాణిస్తారని చెప్పారు. పారాఒలింపిక్స్లో పాల్గొనే దివ్యాంగులను చూసి స్ఫూర్తి పొందాలన్నారు. స్వతహాగా దివ్యాంగుడైన పంచగుడి మహేశ్ స్వయంగా ఉపాధి పొందుతూ తాను సంపాదించిన దాంట్లో నుంచి సమాజానికి ఖర్చు చేయడం చాలా గ్రేట్ అని అన్నారు. దివ్యాంగులకూ ప్రత్యేక హక్కులతో పాటు చట్టాలూ ఉన్నాయని విశిష్ట అతిథిగా హాజరైన డీఎల్ఎస్ఏ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి రాధిక అన్నారు. దివ్యాంగులకూ సత్వరమే న్యాయం అందించేలా ఏర్పాట్లు ఉంటాయన్నారు. ప్రముఖ కంటివైద్యుడు కృష్ణంరాజు మాట్లాడుతూ దివ్యాంగులపై జాలి, దయ మాత్రమే చూపకూడదని, వారికి అవకాశాలు అందిస్తే సకలాంగులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు సేవలందిస్తున్న వివిధ రంగాలకు చెందిన ముత్యంరెడ్డి(జిల్లా కార్మికశా ఖాధికారి), మధుసూదన్(డీడబ్ల్యూఓ), డాక్టర్ స్వప్న(పిల్లల వైద్యులు), స్వర్ణలత (సామాజికసేవకురాలు), రోహిత్ధర్మసేన (సామాజిక సేవకుడు), అవధూత్ నరేశ్(స్పెషల్ టీచర్), రాసం శ్రీధర్(పాత్రికేయుడు)లకు 'దివ్యాంగమిత్ర విశిష్టసేవా పురస్కారాల'ను అందించారు. కార్యక్రమంలో డీఈఓ రామారా వు, పెన్షనర్ల సంఘం జాతీయ నాయకుడు ఎంసీ లింగన్న, ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి దిగంబర్, పడిగెల లక్ష్మీనారాయణ, దశాగౌడ్, శ్రీనిధి ఫౌండేషన్, దివ్యాంగశక్తి ఫౌండేషన్ల ప్రతినిధులు పద్మావతి, రజిత, అనూష, శ్యామ్, లక్ష్మణ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

### ప్యాంటు జేబులో సెల్ ఫోన్ పేలి

# యువకుడికి గాయాలు

**భీంపూర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

ఫోన్లు పేలుతున్న ఘటనలు నిత్యం ఎక్కడో ఒక చోట చూ స్తూనే ఉన్నాం. తాజాగా ఓ యువకుడి ప్యాంటు జేబులో ఉన్న సెల్ ఫోన్ సడెన్‌గా పేలింది. బట్టలకు అంటుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా బోరజ్ హైవే పై జరిగింది. భీంపూర్ మండలం పిప్పల్ కోటికి చెందిన గంగాధర్ అనే యువకుడు డ్రైవర్ గా పని చేస్తున్నాడు. కాగా మహారాష్ట్రలోని బంధువుల ఇంటికి వెళ్లి స్వగ్రామమైన పిప్పల్ కోటికి తల్లితో కలిసి బైక్ పై వస్తున్న క్రమంలో తన స్మార్ట్ ఫోన్ ఒక్కసారిగా పేలిపోయింది. కాలి తొడ స్వల్పంగా కాలిపోయింది. వెంటనే రిమ్స్‌కి వెళ్ళి చికిత్స తీసుకున్నాడు. కొద్దీ రోజుల క్రితం తీసుకున్న సెల్ ఫోన్ పేల డంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వినియోగదారుల ఫోరమ్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.



## పవన్ కళ్యాణ్-శ్రీలీల సీన్ లీక్..

హరీష్ శంకర్- పవన్ కళ్యాణ్ కాంబోలో రాబోతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటోంది. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమా సెట్స్ నుంచి లీకైన పవన్ కళ్యాణ్, శ్రీలీల విజువల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇందులో పవన్ సన్ గ్లాసెస్, టీ షర్ట్- జీన్స్ ధరించి స్టైలిష్ గా కనిపించారు.





## 'రామాయణ 'ప్రాజెక్ట్ పై మరో అప్డేట్...



నితీష్ తివారి దర్శత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న ప్రాజెక్ట్ 'రామాయణ' ప్రాజెక్ట్ పై రోజు రోజు కూ ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా పెరిగి పోతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నిర్మాత నమిత్ మల్హోత్రా ఈ సినిమా బడ్జెట్ గురించి చేసిన వ్యాఖ్యలు మరోసారి అందరి దృష్టిని ఆకర్షించాయి. ఏకంగా రూ. 4000 కోట్లతో దీన్ని నిర్మిస్తున్నట్లు చెప్పి ఆశ్చర్యపరిచారు. భారతీయ సినీ చరిత్రలో ఇప్పటివరకూ.. ఇంత భారీ బడ్జెట్ చిత్రం తెరకెక్కలేదని.. 'రామాయణ' చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. ఏ భారతీయ సినిమా కూడా ఈ ప్రాజెక్ట్ దరిదాపుల్లోకి కూడా రాలేదని తెలిపారు. తరలు మారినా, యుగాలు మారినా రామాయణం ఎప్పటికీ గొప్ప ఇతిహాసమే! అందుకే ప్రపంచమంతా దీనిని చూడాలనే లక్ష్యంతో భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు తెలిపారు నిర్మాత నమిత్. 'రామాయణం' సినిమాతో ప్రపంచమంతా భారత్ వైపు చూస్తుందని అన్నారు.



## నగ్నంగా ఫొటో షూట్

బాలీవుడ్ బ్యూటీ మేఘా శుక్లా తరచూ సోషల్ మీడియాలో గ్లామరస్ ఫొటో షూట్లతో సందడి చేస్తుంటుంది. మోడ్రన్ డ్రెస్, బికినీ, వన్ పీస్ ఇలా డిఫరెంట్ అవుట్ ఫిట్స్ లో హాట్ షో చేస్తూ కుర్రకారుకు నిద్రలేకుండా చేస్తుంది.నటనపై ఆసక్తితో 'కథల్: ఏ జాక్‌ఫ్రూట్ మిస్టరీ' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది ఈ ముద్దుగుమ్మ. కానీ ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అందం, గ్లామర్ పుష్కలంగా ఉన్నప్పటికీ అవకాశాలు రాకపోవడంతో.. సోషల్ మీడియాలో తన గ్లామరస్ ఫొటో షూట్లతో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. వెరైటీ వెరైటీ దుస్తుల్లో బాడీ పార్ట్స్ కనిపించేలా ఫోటోలకు ఫోజులిస్తూ సోషల్ మీడియాను హీటెక్కిస్తోంది. సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసిన ప్రతీ ఫొటో నిమిషాల్లో వైరల్ అవుతూ ఉంటుంది. ఈ బ్యూటీ అందాలను కొందరు పొగుడుతుండగా .. మరికొందరు ఏంటిది? అంటూ తిట్టిపోస్తున్నారు. గ్లామరస్ ఫోటోషూట్‌లతో పాటు, ఆమె తన వ్యక్తిగత జీవితం, ప్రయాణ అనుభవాలను కూడా సోషల్ మీడియాలో పంచుకుంటుంది మేఘా. సోషల్ మీడియాలో ఎల్లప్పుడూ ఫుల్ యాక్టీవ్ గా కనిపించే ఈ బోల్డ్ బ్యూటీ మిలియన్ పైగా ఫాలోవర్లు ఉన్నారు. తాజాగా పర్పుల్ బాడీ కాన్ గౌన్ లో ఇన్నర్ వేర్స్ లేకుండా ఈ బ్యూటీ థై షో నెట్టింట వైరల్ అవుతోంది.



## బ్లాక్ డ్రెస్‌లో నా సామిరంగ బ్యూటీ..

ఆషికా రంగనాథ్ అమిగోస్ సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ఈమె సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడూ ఫొటోలు షేర్ చేస్తుంటుంది. తాజాగా బ్లాక్ డ్రస్‌లో ఉన్న హాట్ ఫొటోలను నెట్టింట షేర్ చేయగా వైరల్ అవుతున్నాయి.డిఫరెంట్ స్టిల్స్‌తో కుర్రకారును పిచ్చెక్కిస్తున్న నా సామిరంగ బ్యూటీ. హాట్ లుక్స్‌తో సూపర్‌గా ఉందని నెటిజన్లు కామెంట్లు. నెట్టింట వైరల్ అవుతునన్ ఫొటోలు



## జీవో 49 రద్దు చేయాలి

**ఆసిఫాబాద్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

జీవో 49 ద్వారా ఆదివాసులను అటవీ ప్రాంతాల నుంచి దూరం చేసి అడవి సంపదను కార్పొరేట్ శక్తులకు దోపిడీకి వేదికగా మారుస్తుంటుందని గోండ్ సేవా సమితి ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడావి గుణవంత్ రావు విమర్శించారు. మంగళవారం గడలపల్లిలో జరిగిన సమావేశంలో జీవో రద్దుకు పైసా తీర్మానం చేసి, రద్దు చేయకపోతే ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా రాయ్ మేడి కుర్సెంగా మోతీరాం, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## వశిష్టలో గోరింటాకు సంబరాలు



**నిర్మల్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

స్థానిక వశిష్ట హై స్కూల్ ఆదర్శ్ నగర్ యందు పర్యావరణ రక్షణ కొరకు మొక్కల పెంపకం ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థిని విద్యార్థులు మొక్కలు నాటారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థినిలు గోరింటాకు లు పెట్టుకుని సంబరాలు మంగళవారం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పర్యావరణంలో మొక్కల యొక్క ప్రాముఖ్యతను మనవ జీవనంలో మొక్కల ప్రాధాన్యత గురుంచి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దినసరి వేతనం రూ.307 వచ్చేలా చర్యలు



**కాగజ్‌నగర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో కోట ప్రసాద్ ఎంపిడీఓ ఆద్వర్యంలో మంగళవారం ఉపాధి హామీ సిబ్బంది టిఏలు క్షేత్ర సహాయకుల తో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో కూలీల దినసరి వేతనం రూ. 307/- వచ్చే విధంగా పనులు ఎంపిక చేసుకోవాలని, వనమహోత్సవం కార్యక్రమంలో టార్గెట్ ప్రకారం రికార్డులు సరిగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో చంద్రశేఖర్ ఏపిఓ, శ్రవన్ ఈసి తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

**ఇచ్చోడ, జూలై 15 (ప్రభాత సమాచారం)**

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మం డల కేంద్రంలో చోటు చేసుకుంది. దేవిదాస్ (45) సోమవారం కిరణా దుకాణంకు వెళ్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. రాకపోయేసరికి భార్య వనిత కనబడుటలేదని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉన్నారని సమాచారంతో వెళ్లి చూడగా దేవిదాస్ పురుగుల మందు తాగి చనిపోయి ఉన్నాడు.

# మార్లవాయి ఆశ్రమ పాఠశాలలో తాగునీటికి విద్యార్థుల తండ్లాట





**జైనూర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

జైనూర్ మండలం మార్లవాయి ఆశ్రమ (బాలుర) పాఠశాల విద్యార్థుల నీటి కష్టాలకు స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్. మంగళవారం రోజు ఆయన స్వయంగా కమిటీ సభ్యులతో కలిసి మార్లవాయి ఆశ్రమ(బాలుర) పాఠశాలను సందర్శించారు. ప్రధానోపాధ్యయునితో మర్యాదపూర్వకంగా కలిసి నీటి సమస్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పక్కనే ఉన్న పంట పొలాల్లో నుంచి నీటిని సరఫరా చేసుకొని వాడుకుంటున్నామని పాఠశాల ఆవరణంలో ఒక ఓపెన్ వెల్ (బావి) ఏర్పాటు చేస్తే నీటి సమస్య శాశ్వత పరిష్కారం అవుతుంది ఆయన తెలిపారు. అదేవిధంగా వాటర్ ట్యాంక్ ను, విద్యార్థులకు తాగడానికి ఉపయోగించే ప్యూరిఫై మినరల్ ప్లాంట్ నీటిని పరిశీలించి త్రాగారు. హాస్టల్ పరిసరాలను వంటగదిని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో ఉన్న నీటి సమస్య గురించి ఈరోజే ఐటిడిఏ పిఓ కుష్బూ గుప్తాను కలిసి వినతి పత్రం అందజేశామని అధికారులు స్పందించి మార్లవాయి ఆశ్రమ పాఠశాలలో ఉన్న నీటి సమస్యను శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపు కరువు



**కాగజ్‌నగర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్రంలోని పాలకులకు ప్రజల సమస్యలపై పట్టింపు కరువైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. తుంగమడుగు గ్రామం సమీపంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి బూతులు మాట్లాడడం కాకుండా ప్రజల బాధలు చూడాలన్నారు. కాగజ్‌నగర్‌కు ఆనుకొని ఉన్న తుంగమడుగు గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదన్నారు. ఈ గ్రామంలో మహిళలు, గర్భిణులు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్డు బాగా లేక పోవటంతో అంబులెన్స్ రాని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర, జిల్లా నాయకులు, అధికారులు స్పందించి గ్రామీణుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించాలి

**వాంకిడి, జూలై 15 (ప్రభాత సమాచారం)**

వాంకిడి మండలం జైత్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన గుడ్లు పిల్లలకు పెట్టినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మంగళవారం డీడీ భాస్కర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో సరఫరా చేసిన గుడ్లను, ఇతర పౌష్టికాహార సరుకులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సరఫరా చేసిన గుడ్లు, కుళ్లిన వాసన వస్తున్నట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. అన్ని కేంద్రాల్లో నాణ్యమైన గుడ్లు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు.





## పొన్నారంలో డ్రైడే కార్యక్రమం

**మందమర్రి, జూలై 15 (ప్రభాత సమాచారం)**

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున వ్యాధుల బారి నుండి ప్రజలను కాపాడేందుకే డ్రైడే కార్యక్రమం చేపడుతున్నట్లు గ్రామ కార్యదర్శి ఎస్ హరీష్ తెలిపారు. మండలంలోని పొన్నారం గ్రామపంచాయతీలో డ్రైడే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించి ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండటం మూలంగా కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండడం మూలంగా దోమలు వ్యాప్తి చెంది విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రామస్తులు తమ ఇంటి పరిసరాలలో మురుగు కాలువల్లో నీరు నిలువ లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈద లింగయ్య, వేల్పుల శ్రీనివాస్, ఆశా వర్కర్ మాసు సుజాత లు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



**ముథోల్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

గంజాయి విక్రయదారులపై చర్యలు తప్పవని ఏఎస్పీ అవినాష్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇద్దరి గంజాయి విక్రవాదారుల అరెస్టు విషయంపై మాట్లాడారు. పట్టణానికి చెందిన షేక్ అహ్మద్, సుల్తాన్ అనే ఇద్దరు దుండగులు గాంధీ గంజ్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారని పక్కా సమాచారం మేరకు సీఐ గోపీనాథ్ ఎస్సై నవనీత్ రెడ్డి,రెవెన్యూ సిబ్బందితో కలిసి దాదాపు రెండు కేజీల గంజాయిని, విక్రయదారులను అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ఇట్టి వ్యక్తులపై గతంలో సైతం కేసులు ఉన్నాయంటూ తెలిపారు. ప్రస్తుతం ఇద్దరి గంజాయి విక్రయదారులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు కాని సేవిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు ఎల్ఈడి టీవీ అందజేత

**జన్నారం, జూలై 15 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ధర్మారం పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న జాదవ్ కృష్ణవేణి మనోజ్ కూతురు శ్రీకృతి పుట్టినరోజు సందర్భంగా పాఠశాల విద్యార్థుల కోసం ఎల్ఈడి టీవీ ని విరాళంగా అందించారు. సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బండి సత్తన్న మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు ముందుకు వచ్చి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాద్యాయులు సాత్పడి నర్సయ్య, సాదుల నర్సయ్య, మేతరి నాగన్న, వాలంటీర్లు బట్టారి కృష్ణవేణి, పావని మేడం, అటెండర్ గొల్లపల్లి నారాయణ పాల్గొన్నారు.



# మావోయిస్టులు జన స్రవంతిలోకి రావాలి

- రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝ
- లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు ప్రభుత్వం అందించే పునరావాస పథకం అందచేస్తాం
- రామగుండం సీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దంపతులు ఆత్రం లచ్చన్న



**మంచిర్యాల, జూలై 15 (ప్రభాత సమాచారం)**

లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు తెలంగాణ ప్రభుత్వం అందించే పునరావాస పథకం అందచేస్తామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. నిషేదిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇరువురు సీనియర్ అజ్ఞాత నాయకులు కమిషనరేటు పోలీసుల ఎదుట మంగళవారం సాయంత్రం లొంగిపోయారు. తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ ప్రజలకు చేస్తున్న వివిధ రకాల సహాయ సహకారాలకు ఆకర్షితులై మావోయిస్టులు లొంగిపోయారని అలాగే లొంగిపోయిన మాజీలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి, తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకొని, కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ ముందు లొంగిపోయారని సిపి అంబర్ కి షోర్ జూ తెలిపారు. కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపి మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టు దంపతుల గురించి పూర్తి వివరాలు వెల్లడించారు. తెలంగాణకు చెందిన ఆత్రం లచ్చన్న అలియాస్ గోపన్న అలియాస్ రాజప్ప, (65) పారపెల్లి గ్రామం, కోటపల్లి మండలం, మంచిర్యాల జిల్లాకు చెందినవాడని, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్ సీఎం/ఇంచార్జీ డివిజన్ టెక్నికల్ టీం,నార్త్ బస్తర్ డివిసి, ఛత్తీస్గఢ్ 1983 సంవత్సరం లో సిపిఐ ఎంఎల్ పీపుల్స్ వార్‌లో దళ సభ్యుని చేరి చెన్నూర్ దళం లో పనిచేశాడని, 1988 సం వత్సరంలో ఏరియా కమిటీ మెంబర్‌గా పదోన్నతి పొంది సిర్పూర్ దళానికి డిప్యూటీ కమాండర్‌గా పనిచేశాడని, 1989 సంవత్సరంలో చౌదరి ఆంకుభాయి అలియాస్ అనితక్కని వివాహం చేసుకున్నాడని, ఆ తరువాత పార్టీ అతడిని 1995 వ సంవత్సరంలో టెక్నికల్ డిపార్ట్మెంట్ కి బదిలీ చేసి పట్టణ ప్రాంతానికి పార్టీ పని నిమిత్తం పంపించారని, 2002 సంవత్సరంలో డీసీఎం గా పదో న్నతి పొంది తిరిగి డీకే ఎస్ జెడ్‌సిలోని టెక్నికల్ డిపార్ట్ మెంట్ కి బదిలీ అయ్యాడని, 2007 సంవత్సరంలో పార్టీ అతడిని నార్త్ బస్తర్ డివిసి టెక్నికల్ డిపార్ట్ మెంట్ కి ఇంచార్జ్ గా నియమించిందని, 2023 సంవత్సరంలో ఇతనికి డీకే ఎస్ జెడ్ సిఎంగా పదోన్నతి లభించింది. లొంగిపోయేంతవరకు లచ్చన్న అక్కడే పనిచేస్తున్నాడని, ఆత్రం లచ్చన్న పై తెలంగాణ లోని వివిధ జిల్లాలలో 35 కేసులు నమోదు చేయబడ్డాయని, చౌదరి ఆంకుభాయి ఏ అనితక్క ఏ లక్ష్మి,భర్త ఆత్రం లచ్చన్న ఏ గోపన్న, 55 సం:లు, ఆగరగుడా గ్రామం, బెజ్జూర్ మండలం, కొమరంభీంఆసిఫాబాద్ జిల్లా తెలంగాణ రాష్ట్రం.డీసీఎం, డివిజన్ టెక్నికల్ టీం,నార్త్ బస్తర్ డివిసి,ఛత్తీస్గఢ్.అనితక్క 1988 వ సంవత్సరంలో తన అన్న చౌదరి చిన్నన్న ప్రోత్సాహంతో సిపిఐ ఎం.ఎల్ పి డబ్ల్యు లో దళ సభ్యురాలిగా చేరి సిర్పూర్ దళంలో పనిచేసింది. అలా సిర్పూర్ దళంలో పనిచేస్తుండగా సిర్పూర్ దళం డిప్యూటీ కమాండర్‌గా పనిచేస్తున్న ఆత్రం లచ్చన్నని వివాహం చేసుకుంది.1995 వరకు సిర్పూర్ దళంలోనే పనిచేసి 1995 లో తన భర్తతో పాటు పట్టణ ప్రాంతానికి బదిలీ అయిందని, 2002 సంవత్సరంలో ఎస్ సిఎం గా పదోన్నతి పొంది తిరిగి డీకే ఎస్ జెడ్ సి లోని టెక్నికల్ డిపార్ట్ మెంట్ కి తన భర్త తోపాటుగా బదిలీ అయ్యిందని, 2007 సంవత్సరంలో అనితక్క నార్త్ బస్తర్ డివిసి టెక్నికల్ డిపార్ట్ మెంట్ కి బదిలీ అయ్యిందని, లొంగిపోయేంతవరకు నార్త్ బస్తర్ డివిసి లోని టెక్నికల్ డిపార్ట్ మెంట్ లో డీసీఎం గా పని



చేస్తుందని, చౌదరి ఆంకుభాయి పై కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 14 కేసులు నమోదు చేయబడ్డాయనితెలిపారు.

**మీ ఊరికి రండి!మావోయిస్టులకు పోలీసుల ఆహ్వానం**

రామగుండం కమిషనరేట్ పోలీసు శాఖ తరుపున అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులను జన జీవన స్రవంతిలోకి రావలసిందిగా సిపి కోరారు. తెలంగాణ మావోయిస్టులు వారి గ్రామాలకు తిరిగి రావాలని, తెలంగాణ అభివృద్ధికితోడ్పడాలని అన్నారు. అజ్ఞాత మావోయిస్టులు వారి గ్రామాలకు తిరిగి వచ్చినట్ల యితే, తెలంగాణ ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టులకు ఇచ్చే పునరావాస పథకాలు ఇతర సహాయ సహకారా లు అందిస్తుందని, వారు స్వతంత్రంగా జీవించే విధంగా ప్రభుత్వం వారికి అన్నివిధాల తోడ్పాటును అందిస్తుందన్నారు. లొం గిపోయిన సభ్యులకు జీవనోపాధి పునరావా సంకల్పించడం కోసం ప్రభుత్వం తరఫున అందవలసిన అన్ని ప్రతిఫలాలను అందజేయడానికి రామగుండం కమిషనరేట్ పోలీ సు శాఖ ఎల్లప్పుడూ కృషి



చేస్తుందని హామీ ఇచ్చారు.

**ప్రజా సంఘాల ముసుగులో దందాలు...**

కొంతమంది వ్యక్తులు ప్రజా సంఘాల ముసుగులో శాంతి భద్రతలకు భంగం కలిగించే రీతి లో వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిపై పోలీసుల నిఘా కొనసాగుతుందని. వారు శాంతి భద్రతలకు విఘాతం కలిగించినట్లయితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసు కోబడతాయని అన్నారు. యువత, ప్రజలు ఇటువంటి వారికిదూరంగా ఉండాలని కో రారు. మావోయిస్టులకు నేటి యువత దూ రంప్రస్తుత సమాజంలో యువత చైతన్యవంతంగావ్యవహరిస్తున్నదిచట్ట వ్యతిరేక కార్యక లాపాలకు దూరంగా ఉంటున్నారు. మావోయిస్టు పార్టీలోకి రిక్రూట్మెంట్ పూర్తిగా తగ్గి పోయిందని. చదువుతున్న వారు ఎవరు మావోయిస్టు పార్టీలోకి వెళ్ళడం లేదని, కా లం చెల్లిన సిద్ధాంతం మావోయిజం నేటి ప్రపంచంలో మావోయిజం కాలం చెల్లిన సి ద్ధాంతంగా మిగిలిపోయింద న్నారు. హింస ను ప్రేరేపించే సిద్ధాంతాన్ని ప్రజలు తిరస్కరించారని, ప్రపంచంలోని అనేక దేశాలలో ఈమావోయిజంకనుమరుగైపోయింద్నరు.

**పోరు వద్దు!! ఊరు ముద్దు!!**

మావోయిస్టులు ఆయుధాలను, అజ్ఞాతాన్నివీడండని జనజీవన స్రవంతిలో కలవం డని సిపి మావోయిస్టులను కోరారు.




# మెరుగైన వైద్య సేవలు అందించాలి

**నార్నూర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

నార్నూర్ మండలంలోని 30 పడకల సామజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్వశా "దన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి పరిశీలించారు. స్వశోదన్ ట్రస్ట్ సేవా కార్యక్రమాల్లో భాగంగా, ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయబ డింది. ఈ క్యాంప్ వివిధ వైద్య విభాగాల నిపుణులు ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. జనరల్ చెకప్, షుగర్, బీపీ, ఈసీజీ, మహిళల ఆరోగ్య పరీక్షలు, పిల్లల చికిత్సలు తది తర సేవలు అందుబాటులో ఉంచారు. ఈ క్యాంప్ ద్వారా సుమారు 350 మంది లబ్ధిదారులు వైద్య పరీక్షలు చేయించు కున్నారని, ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నినాదంతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం, జరు గుతుందన్నారు. అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని, కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం విజయ వంతంగా జరగడానికి సహకరించిన వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు గ్రామస్థులకు ట్రస్ట్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, అడిషనల్ డిఎంహెచ్ మనోహర్, సాధన, జనరల్ ఫీజిషియన్ విజయలక్ష్మి,పాల్గొన్నారు.

# నెల రోజుల్లోగా సమస్యలు పరిష్కరించాలి

- బీసీ,ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహారాజ్
- మన భూమి రథయాత్రలో భాగంగా ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

**ఆదిలాబాద్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లాలో రెండు నెలల పాటు చేపట్టిన మా భూమి రథయాత్రలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలు దారుణంగా కనిపించాయని ఆ సమస్యలను పరిష్కరించాలని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ విశా రదన్ మహరాజ్ అన్నారు. లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్రలో భాగంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. అధికారులు అందుబాటులో లేకపోవడం ద్వారా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో నరేందర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లాలోని 15 మండలాలను తిరుగుతూ అనేక రకాల సమస్యలను గమనించామని, ఆ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు విన్నవించారని పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఇప్పటి వరకు పరిహారాలు అందించలేదని, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న




గ్రామాలు ఉన్నాయన్నారు. అనేక సమస్యలు జిల్లా కలెక్టర్ కు విన్నవించమని, వాటిని 30 రోజుల్లో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ,ఎస్టీ,ఎస్టీ జేఏసీ నాయకులు ఉదారి నారాయణ, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు దర్శనాల సుష్మ, ఏనుగు శ్యామల, మంజూష గంగామణి, వివిధ మండల నాయకులు తదితరులు ఉన్నారు.

# అంతర పంటగా ఆయిల్ ఫామ్ సాగు చేస్తే గిట్టుబాటు

**నార్నూర్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

నార్నూర్ మండలం తడిహత్నూర్ గ్రామంలో మంగళవారం కలెక్టర్ రాజర్షిషా వనమహోత్సవంలో భాగంగా ఆయిల్ పామ్ మొక్కలు నాటి ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్‌ను జిల్లా వ్యాప్తంగా 80 ఎకరాల్లో ప్రారంభించా రు. ఈ సందర్భంగా జిల్లాలోని 25 మంది రైతులు సుమారు 4000 మొక్కలను నాటడం జరిగిందన్నారు. అంతర పంటగా అయిల్‌ఫామ్‌ను సాగు చేస్తే గిట్టుబాటు అవుతుందన్నారు. బిందు సేద్య పరికరాలపై రైతులకు రాయితీలను అందిస్తుందని, తోట నిర్వహణ, అంతర పంటల యాజమా న్యం కొరకు 4200 ఒక ఎకరానికి, నాలుగు సంవత్సరాల పాటు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నార్నూర్‌ను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిద్దెందుకు ఉద్యాన శాఖ ధృడ సంకల్పంతో ఉందన్నారు. నీతి అయోగ్‌లో భాగంగా



నార్నూర్ మండలం అభివృద్ధిలో ముందడుగు వేస్తోందన్నారు. పోషకాహార భద్రత కల్పించే దిశగా పలు పథకాల ద్వా రా శాఖ ముందుకు సాగుతుందన్నారు.

# రైతులు సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలి







- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- కడెం ప్రాజెక్టు ఎడమ కాలువ నీరు విడుదల
- కడెం ప్రాజెక్టును పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం
- రూ.9కోట్ల 46 లక్షలుతో ప్రాజెక్టుకు మరమ్మతులు

**కడెం, జూలై 15 (ప్రభాత సమాచారం)**

రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కడెం ప్రాజెక్టు ఎడమ కాలువ నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో పంటలను పండించాలన్నారు. కడెం ప్రాజెక్టు మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం 9కోట్ల 46 లక్షలు ఖర్చు చేసిందన్నారు. త్వరలో పూడికను తొలిగిస్తామని తెలిపారు. రోడ్డుకు మరమత్తులు చేపడతామని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల వద్ద సెప్టిక్ ట్యాంక్ పనులకు భూమి పూజ చేశారు. తదనంతరం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోలార్ పెన్సిగ్ పనులకు భూమి పూజ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని మెరుగుపరచడానికి పాఠశాల, కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు,



# పేదల కోసమే ప్రజా ప్రభుత్వం పాటు పడుతోంది

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



**పెంబి, జూలై 15 (ప్రభాత సమాచారం)**

పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం పెంబి మండల కేంద్రంలో ఎంపిడిఓ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.అనంతరం మండల కేంద్రంలోనీ జెడ్పీఎస్ఎస్ పాఠశాలతో పాటు మందపల్లి గ్రామంలోని కెబీబీవీ పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేదింటి అడపడుచుల ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం వారికి 1లక్ష నూట 16 రూపాయలను అందిస్తుందని తెలిపారు. పేదలకు మేలు చేయడమే కోసమే ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని పేర్కొన్నారు. పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల చుట్టూ మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY



# రైతులు భూసార పరీక్షలు నిర్వహించాలి

**ఎరువుల వాడకం తగ్గింపుతోనే భూముల పరిరక్షణ**

**మట్టి సమునా పరీక్ష పత్రాలను పంపిణీ చేసిన కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్, జూలై 15 (ప్రభాత సమాచారం)**

రైతులందరు తప్పకుండా తమ వ్యవసాయ భూమి మట్టి పరీక్షలు చేయించుకోవాలని, భూమి పరిరక్షణకు అనుసారం ఎరువులు వాడలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. మంగళవారం నార్నూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ, ఇఫ్కో వారి ఆధ్వర్యంలో నానో యూరియా ప్లస్, నానో డిఏపి పై ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కో-ఆపరేటివ్ లిమిటెడ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూసార పరిరక్షణ పథకం, భూసార పరీక్ష విశ్లేషణ పత్రా లను కలెక్టర్ రైతులకు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. త్వరలోనే ప్రతీ గ్రామంలో సాయిల్ హెల్త్ అవేర్నెస్ ప్రోగ్రామ్లు నిర్వహించడం జరుగుతుందన్నా రు. సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ అంటే, రైతుల భూమి ఆరోగ్య స్థితిని తెలుసుకోవడానికి, నేల పరీక్షలు నిర్వహించి, ప్రతి రైతుకు వ్యక్తికరించిన మట్టి ఆరోగ్య కార్డులను అందించడం అన్నారు. ఈ కార్డులలో నేల బలాలు, బలహీనతలు, సూక్ష్మ పోషకాల లోపా లు, పంటలకు అవసరమైన ఎరువుల సిఫార్సులు ఉంటాయని తెలిపారు. నేల పరీక్షల ద్వారా భూమిలో ఉన్న పోషక పదార్థాల స్థాయి వంటి ముఖ్యమైన విషయాలను తెలుసుకోవచ్చని అన్నారు. రైతులు అవసరమైన మొత్తంలో మాత్రమే ఎరువులను ఉపయోగించవచ్చు, ఇది అధిక ఖర్చులను తగ్గిస్తుందని, భూమి ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. ఈ అవగాహన సదస్సులో శిక్షణ కలెక్టర్ సలోని, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, జిల్లా ఉద్యాన వన అధికారి సుధాకర్, వ్యవసాయ కళాశాల అసోసియెట్ శ్రీధర్ చౌహన్, సీనీయర్ శాస్త్రవేత్త డాక్టర్. రాజశేఖర్, సోయిల్ సయిన్స్ ప్రొఫెసర్ ప్రవీశ్ కుమార్, డిఆర్డీఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

